# అప్రయోజకుని కోపం

శారద చెప్పినమాట విని తెల్లబోయాడు కాంతారావు. అతనిలో అవమానం, పౌరుషం పెచ్చుపెరిగిపోయాయి.

"నాతో చెప్పకుండా యిటువంటి పని ఎందుకుచేశావ్ ? నే నెటువంటి మనిషినో తెలుసా ? తినటానికి డబ్బులేకపోతే పస్తయినా వుంటానుకానీ నీ పుట్టింటివారి సొమ్ము తీసుకుంటానను కున్నావా ?" అని కోపంతో అరిచాడు.

భర్త యిలా అంటాడని శారద అనుకోలేదు. తనుచేసిన పనికి సంతోషిస్తాడు అనుకొంది. ఆపత్సమయంలో అడ్డుకున్నందుకు అభినందిస్తాడేమో ననుకున్నది తనుచేసిన సహాయానికి. కాని యిదేమిటి ? తను అనుకున్నదానికి విరుద్ధంగా జరుగుతూంది ?

"నేను చేసిన పనికి మీకింత కోపం వస్తుందని తెలీదు. ఇంటాయన చాలా అల్లరిపెట్టుతూవుండటంచేత విధిలేక మా నాన్నకు రాసి యీ డబ్బు తెప్పించాను" అన్నది భయపడుతూ.

అయినా కాంతారావు శాంతించలేదు. ఇంటి యజమాని తనను బాధే పెడుతున్నాడు. అద్దె చెల్లించమని నానారభసా చేస్తున్నాడు. అయినంతమాత్రాన తన అనుమతి తీసుకోకుండా వాళ్ళ నాన్నకి రాసి రెండువందల రూపాయలు తెప్పిస్తోందా ? మామగారి

సాయంతో యిబ్బంది గడుపుకొన్నాడనే మాట వస్తే తనకెంత అవమానం? తన అవసరంసంగతి తనకు తెలీదూ? ఆ విషయం భార్యకే పట్టిందా?

ఇలా ఆలోచించుకుని కాంతారావు, "ఇదిగో శారదా!—ఇటువంటి పనులు యింకెప్పుడూ చేయకు. నా విషయం తెలుసుగా. ఈ డబ్బు ఎక్కడనుంచి వచ్చిందో అక్కడికే చేరనియ్యి. తెలిసిందా?" అన్నాడు శాంతంగానే, కోపాన్ని చంపుకొని.

శారదకు యిదేమీ సబబుగా కనిపించలేదు. జరిగిపోయిందేదో జరిగిపోయింది. తన తండ్రి డబ్బు పంపించాడు. అది ఇప్పుడు తిరగ్గొడితే ఏం బాగుంటుంది? వాళ్ళకుమాత్రం కోపం రాదూ? అయినా అప్పుడే యిబ్బంది ఎలా గడుస్తుంది? ఇంటియజమాని రోజూవచ్చి బెదిరించి వెళ్తున్నాడు. అయినా అతనుమాత్రం ఎన్నాళ్ళని వూరుకుంటాడు? అయిదునెలల అద్దె బకాయి పడ్డారు. రేపోమాపో యివ్వకపోతే యిల్లు ఎలాగూ ఖాళీ చేయిస్తాడు. అప్పుడు యింట్లోని సామానుకూడా వదులుకుని పోవలసివస్తుంది. నలుగురిలోనూ నవ్వులపాలు.

అందుకని శారద భర్తవంక చూసి, "అయిపోయిందేదో అయిపోయింది. వాళ్ళకు యిది తిరిగి పంపిస్తే ఏమనుకుంటారు? నామాటవిని యింటాయనకు యిచ్చేసిరండి" అన్నది.

ఈసారి కాంతారావు కోపం ఆపుకోలేకపోయాడు. అతని మొహం జేవురించింది. కళ్లు ఎర్రబడ్డాయి. చేతులోవున్న రెండు పెద్దనోట్లనూ భార్య ముఖంమీదకు విసిరికొట్టి, "నీ వ్యవహారం చాలావరకూ వచ్చింది. చేసిన తప్పును సరిదిద్దుకోవటం అటుంచి నాకు ఎదురు వుపదేశం చేస్తున్నావా? ఇటువంటి పనులు ఇంకెప్పుడయినా చేశావంటే ఎముకలు విరగ్గొడతాను,"

అని నాలుగు మాటలూ అని పెద్దపెద్ద అంగలువేసుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. వెనకనుంచి భార్య బ్రతిమిలాడుతున్నా వినిపించుకోలేదు. భోజనంముందు కూర్చొబోయిన అతను ఆ విషయంకూడా మరిచిపోయి వీధిలోకి వెళ్ళిపోయాడు.

కాంతారావు వీధులన్నీ యిష్టంవచ్చినట్లు తిరిగాడు. స్నేహితులెవరో అక్కడక్కడ కనబడి పిలిచినా వినిపించుకోలేదు. అతనికోపం అలాంటిది. కోపం సమయంలో తను ఏమి చేస్తున్నాడో, ఎక్కడికి పోతున్నాడో తెలియకుండా ప్రవర్తిస్తాడు. శారద తనను ఎందుకు అంత అవమానం చేసింది? తన స్వభావం తెలిసికూడా ఆ విధంగా ప్రవర్తించిందంటే తన అశక్తిని వెల్లడిచేయటానికి కాకపోతే మరెందుకవుతుంది? అసలు ఆమెను నాలుగు వుతికితే బావుండేది. అంతకోపంలో వుండికూడా ఎలా క్షమించగలిగాడు? తను భార్యకుకూడా లోకువయిపోయాడు! మరీ అంత అవసరమైతే తల తాకట్టు పెట్టి తెస్తాడు డబ్బు. అంతేగాని చేతగాక మామగారి సహాయం కోరటమా?

అయినా యింటి యజమాని సుబ్బయ్య ఒక మూర్ఖపు పశువు. ఒక పదిరోజులు ఆగమంటే ఆగనంటాడు. అయిదునెలల నుంచి వూరుకోలేదూ? అలానే యీ పదిరోజులూ నోరుమూసుకుని వూరుకుంటే ఆ డబ్బేదో వాడి మొహాన కొడతాడు తాను. తన స్నేహితులు చాలామంది యింకా కొద్దిరోజుల్లో సహాయం చేస్తానన్నారు. తను అవసరానికి ఎంతమంది స్నేహితులకు అప్పివ్వలేదూ? వాళ్ళంతా తిరిగి ఇచ్చారా ఏడిచారా? ఆ డబ్బు రాబట్టి వుంటే దానితో యీఅద్దె సునాయాసంగా తీర్చేయవచ్చు.

కాని తన కాశక్తి లేదుగా. స్నేహితుల్ని ముఖాముఖిగా అడగ లేదు. అందుకనే అప్పుగామాత్రం అడిగేడు. పదిరోజుల్లో ఇస్తానని వాళ్లు మాటిచ్చారు. ఇస్తారుకూడానూ. వాళ్ళ కా మాత్రం విశ్వాసం వుండదూ?

నడుస్తున్న కాంతారావు చటుక్కున ఆగిపోయాడు. అతని ప్రక్కనే "నవజీవన్ విలాస్" బోర్డు సాక్షాత్కరించింది. భోజనం విషయం గుర్తువచ్చింది. అణిగిపోయిన ఆకలి తిరిగి బాధపెట్టటం ప్రారంభించింది. ఇంటికి వెడితే? తన కోపం యింకా చల్లారకుండానే అప్పుడే యింటికా? సాయంత్రం వరకూ ఆ విషయం తలపెట్టకూడదు. జేబు తడుముకున్నాడు. ఒక రూపాయినోటూ, ఒక పావలా చిక్కాయి. ప్రస్తుతం హోటల్లో భోజనం చేయటానికి యివిచాలు. గబగబ హోటలు మెట్లు ఎక్కి లోపలికి ప్రవేశించాడు.

అరగంట గడిచింతర్వాత సంతృప్తితో బయటకు వచ్చాడు కాంతారావు. సిగరెట్ తీసి ముట్టించి నడవసాగాడు. ఎంతసేపూ యిలా తిరగటమంటే విసుగువేసింది. అయితే మరెక్కడికి పోవటం? ఎవరైనా స్నేహితుడింటికి పోతే బాగుండుననిపించింది. కాలక్షేపానికి చీట్లపేక వుందిగా.

స్నేహితుడి యింటికి పోదామని వెనక్కితిరిగాడు. రోడ్డుమధ్య దెయ్యంలా నిల్చునివున్న క్లాక్‌టవర్‌లో పన్నెండయింది. ఎండ మిటమిటలాడుతోంది. త్వరగా పోదామని గబగబ నడవసాగాడు కాంతారావు.

"ఏయ్, పంతులూ! ఆగు."

వెనుకనుంచి ఒక బొంగురుగొంతు అరిచింది. కాంతారావు

గుండె గుబగుబలాడింది. వాడే ఆ నాడిస్వెధవ. వడవడ లాడుతూ నిలబడ్డాడు అతను.

"ఏంబాబూ! ఎక్కడికి?"మా జోరుగా వెడుతున్నావ్?" ఎంత వెకిలిగా అంటే అవతలివాడి మనస్సు చివుక్కుమంటుందో అంతకు రెట్టింపు యిదిగా అన్నాడు యింటి యజమాని సుబ్బయ్య.

సుబ్బయ్య విషయం కాంతారావుకి బాగా తెలుసు. అతను అవ మానం చేయదల్చుకుంటే రోడ్డుమధ్య నిలబెట్టి మాట్లాడతాడు నలుగురూ వినేలాగ. ఐనా నిన్నరాత్రేగా బెదిరించి వెళ్ళింది. ఇప్పుడేనా? ఎక్కడ కనిపిస్తే అక్కడ తనని అవమానం చేయటమే అన్నమాట?

"మాటాడకుండా నిలబడ్డావేమయ్యా? అద్దె ఎగేసి, సిగరెట్టు కాల్చుకుంటూ తిరుగుతున్నావే. సిగ్గులేదయ్యా" మాటలు చాలా యిదిగా రానిస్తున్నాడు. ఏమనటానికి నిస్సహాయుడు అయి పోయాడు కాంతారావు,

"రోడ్డుమీద ఎందుకండీ గల్లంతు? పదిరోజుల్లో మీ కివ్వ వలసిందంతా యిచ్చేస్తా నన్నాగా."

సుబ్బయ్య స్వరం యిప్పుడు సరియైనస్థాయిని అందుకుంది. "ఏం పదిరోజులయ్యా, పదిరోజులు! ఎలా అంటున్నావింకా ఆమాట? ఆయిదునెల్ల అద్దె ఎగేసి ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నావయ్యా తిరిగి? పౌరుషం వున్నవాడివైతే నా డబ్బు నాకు యిచ్చేసెయ్యి. లేకపోతే నేను ఏమాటన్నా కుక్కన పేనులాగ పడివుండు."

ఛా! మూర్ఖపు వెధవ! నోటికొచ్చినట్లు వదరుతున్నాడు

విచక్షణాజ్ఞానం లేకుండా. అయినా వాడినిప్పుడు ఏమిటీ చెయ్యటం ?

అప్పటికే నలుగురూ పోగయ్యారు. ఏమిటేమిటంటూ. సుబ్బయ్య విసుక్కోకుండా అడిగినవాళ్ళందరికీ సోదంతా ఏకరువు పెడుతున్నాడు. కాంతారావు తలయెత్తలేకపోయాడు. సభాసదుల్లో గుసగుసలు ప్రారంభమయినాయి. ఎవరి అభిప్రాయాలు వారు అందచేసి తీర్పు చెపుతున్నారు. కాంతారావు ఇక అక్కడ వుండలేకపోయాడు. పౌరుషంకొద్దీ, "ఇవాళ రేపట్లో మీ బాకీ తీర్చేస్తానులెండి" అనిచెప్పి గుంపును తప్పించుకుని బయట పడ్డాడు. అతను వెళ్ళిపోతుంటే వెనకనుంచి సుబ్బయ్య, "సాయంత్రమొస్తా యింటికి. మర్యాదగా యిచ్చేసెయ్యి. లేకపోతే మెడబట్టి గెంటుతా బయటికి" అని వదరుతూనేవున్నాడు.

కాంతారావు బయటపడి నడుస్తున్నా అతని మనస్సు బిక్కచచ్చిపోయింది. ఇంతకుముందే తను చచ్చిబ్రతికాడు. నలుగురిలోనూ ఘోరమైన అవమానం జరిగిపోయింది. తనకు తెలిసినవాళ్లు ఎవరైనా అందులోవుంటే సిగ్గుసిగ్గు.

ఈ సుబ్బయ్యపీడ గట్టిసమస్యే అయికూర్చుంది. వీడి నెలాగ వదిలించుకోవటం ? నూట డెబ్బయి అయిదు రూపాయలు సాయంత్రంలోగా కావాలి తనకు. ఎలాగ ? లేకపోతే అతను తప్పకుండా బయటకు గెంటుతాడు. సందేహంలేదు. మరయితే ఏమిటి చెయ్యటం ?

శారద తండ్రికిరాసి, రెండువందలు తెప్పించింది, అందుకోసం ఆమెను తను నానామాటలూ అన్నాడు. నిజానికి ఆలోచిస్తే

ఆమె తప్పేముంది యిందులో. అవసరానికి తెప్పించింది. కాంతారావు కోపం రానురాను దిగజారసాగింది. "పోనీ అది తీసుకుని యిబ్బంది గడుపుకుంటే?" అనుకున్నాడు. ఇందాక నిరాకరించి, తిట్టి, ఇప్పుడు తిరిగి ఆమె సహాయాన్ని అర్థించటమా? ఎంత సిగ్గుపడవలసిన విషయం? కాని వేరే దారి లేదుగా? సాయంత్రానికి వాడువచ్చి యముడులాగా కూర్చుంటాడు. అది తప్పించుకోవాలంటే భార్యను సాయం కోరి తీరాలి.

ఏంచేస్తాడు? అవసరం. అవసరంకోసం ఎటువంటిపనయినా చెయ్యాలి. కాదంటే ముప్పు. కాంతారావు ఇంటిదారిపట్టి నడవసాగాడు మనస్సు మార్చుకుని.

మరో పావుగంటకల్లా ఇల్లుచేరాడు. తలుపు కొట్టేటప్పటికి శారదవచ్చి తలుపుతీసింది. ఆమె స్థితి చాలా శోచనీయంగా వున్నది. ముఖం కళావిహీనంగా వుంది. జుట్టంతా రేగిపోయి జాలిపుట్టిస్తున్నది.

కాంతారావు తన క్రూరత్వానికి తనని తాను నిందించుకున్నాడు. లోపలికిపోయింతర్వాత ఆమెను దగ్గరకు తీసుకుని, "అనవసరంగా నిన్ను కష్టబెట్టాను శారదా. తప్పు క్షమించవూ?...." అని వేడుకున్నాడు.

ఆమె అతనివంకచూసి, "అలా అనకండి. నామీద కోపంచేత భోజనమయినా చేయకుండా వెళ్ళిపోయారు. మీరు ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తూ కూర్చున్నాను" అన్నది.

కాంతారావు దానికేం జవాబు చెప్పలేదు, అయిదు నిముషాలు

గడిచింతర్వాత సానునయంగా "ఆ డబ్బు.... దాని నెక్కడ వుంచావు?" అనడిగాడు.

ఆమె అతని మొహంలోకి చూడకుండా మాటల్లోనే విరక్తిభావం సూచిస్తూ "పాడుడబ్బు పోనిద్దురూ. దానివల్లనే మీకు కోపం వచ్చింది. ప్రక్కింటి అబ్బాయిచేత దానిని మా నాన్నకు తిరిగి పంపించివేశాను" అన్నది.

---

కథా నిలయం
శ్రీకాకుళం